# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-04-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్టను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **హైదరాబాద్ మెట్రో సేవలను విస్తరించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
3. **ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.**
4. **అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈరోజు ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల అవుతాయని ఇంటర్‌బోర్డు ప్రకటించింది.**

==========================

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్టలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కడప జిల్లా ఒంటిమిట్టలో నిన్న జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఒంటిమిట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ...

..వాయిస్... 34 సెకన్లు

---------------------------

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న "ఫ్యూచర్ సిటీ" వరకూ హైదరాబాద్ మెట్రో సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెట్రో విస్తరణపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో సంబంధిత అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు ఈ సందర్భంగా అధికారులు

ముఖ్యమంత్రికి వివరించారు.

---------------------------

ప్రభుత్వ ఆసుపత్రులలో అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రిలో 6 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్‌ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామితో కలిసి నిన్న ప్రారంభించారు. కార్డియాలజీ విభాగం 51 యాంజిగ్రామ్ పరీక్షలు చేసిందని వివరిస్తూ....

...వాయిస్... 38 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ఫలితాలు ఈరోజు విడుదల కానున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృతిక శుక్లా ఒక ప్రకటనల్లో తెలిపారు. ఈ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారని చెప్పారు. విద్యార్థులు తమ ఫలితాలను resultsbie.ap.gov.in వెబ్‌సైట్ సందర్శించి తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా తొలిసారి వాట్సాప్ ద్వారా ఫలితాలు విద్యార్థులకు అందించే ఏర్పాట్లను బోర్డు చేసిందన్నారు. వాట్సాప్‌లో 95523 00009 నెంబర్‌కు 'హాయ్' అని సంక్షిప్త సందేశం పంపి, హాల్ టికెట్ నెంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు నమోదు చేసి ఫలితాలు పొందవచ్చని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోడియా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఈరోజు సెలవు దినమైనప్పటికీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉదయం 10 గంటల 30 నిముషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిముషాల వరకూ యథావిధిగా పని చేస్తాయని ఆ శాఖ అధికారులు తెలిపారు.

---------------------------

అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలోని జగ్గారం నుంచి ఊకెవారిగూడెం గ్రామానికి కోటి 20 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో కనీస సౌకర్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

---------------------------

ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో ప్రతి రూపాయిని అభివృద్ధి పనులకే వినియోగిసాతమని గ్రేటర్ హైదరాబాదు నగరపాలక సంస్థ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆస్తి పన్ను విభాగంలోని అధికారులు, సిబ్బందిని ఆయన నిన్న సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన ఆర్థిక సంవత్సరానికి 2 వేల కోట్ల రూపాయలకుపైగా ఆస్తి పన్ను వసూలు

కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ రెవెన్యూ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లను అభినందిస్తూ ప్రశంస పత్రాలను అందించారు.

---------------------------

ప్రజల సేవలో కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులోని ఏరియా ఆసుపత్రికి దాతలు అందించిన 13 లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలను నిన్న మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సమాజంలో ఆర్థికంగా ఎదిగిన వ్యక్తులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందించదగిన విషయమన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షను ఈనెల 21వ తేదీకి వాయిదా వేసినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు వెల్లడించారు. తొలుత ఈ పరీక్షను ఈ నెల 20వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆ రోజు ఈస్టర్ పర్వదినం కావడంతో పరీక్షను వాయిదా వేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష తేదీ మార్పు విషయాన్ని గమనించాలని కోరారు.

---------------------------

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలో భవిత, ఆటిజం కేంద్రాలపై జాతీయ స్థాయి నిపుణులు, ప్రముఖ వైద్యులతో నిన్న జరిగిన కార్యశాలలో ఆయన మాట్లాడుతూ... ఆటిజం కేంద్రాలు రాష్ట్రంలోని దాదాపు 89 వేల మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మద్దతుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వంతో పాటు నిపుణులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మాత్రమే దీన్ని కార్యరూపంలోకి తీసుకురాగలమన్నారు. ఆటిజం కేంద్రాల నిర్వహణకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు.

---------------------------

ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్ నియామకాల దరఖాస్తు తేదీని ఈ నెల 25వ తేదీ వరకూ పొడిగించినట్లు గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ జూన్‌లో ఉంటుందని, తెలుగు సహా 13 ఇతర భాషల్లో ఈ పరీక్ష నిర్వహించే నిర్వహిస్తామని పేర్కొన్నారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని, దళారీలు, మోసగాళ్ల బారినపడకుండా అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ఫార్మా రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన ప్రోత్సహకాలు ఇస్తుందని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్ తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని ఒక హోటల్‌లో 'ఫార్మా టెక్ కవరేజి' అనే అంశంపై నిన్న సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో 60

శాతం వ్యాక్సిన్‌లు రాష్ట్రంలోనే తయారవుతున్నాయని తెలిపారు. జనరిక్ మందులు తయారీ, విక్రయాలు రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయని చెప్పారు.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారులు, స్త్రీల ఆరోగ్య పరిరక్షణ కోసం పోషక ఆహారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "జాతీయ పోషకాహార మిషన్ "ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 7 వ విడత పోషణ పక్షోత్సవాలను ఈ నెల 22 వ తేదీ వరకు నిర్వహిస్తోంది. పోషన్ పఖ్వాడా చిన్నారుల జీవితంలో పోషక అభివృద్ధికి కీలకమైన మొదటి వెయ్యి రోజులపై దృష్టి పెడుతుంది. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న వారిని ముందుగా గుర్తించి తగిన సంపూర్ణ పోషణ అందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అలాగే ఈ కార్యక్రమం, పోషకాహార ప్రాధాన్యాన్ని తెలియజేయడంతో పాటు బాలల్లోని ఊబకాయంపై దృష్టి సారిస్తుంది.

======================